క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని, ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 15వ డివిజన్ సంగడిగుంట రెడ్లబజార్ 3వ లైనులో శుక్రవారం సైడు కాలువలు, చెక్కల బజార్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ రామన బోయిన అజయ్‌కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి కుల, మత, పార్టీలకతీతంగా నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూరీ ఫాతిమా, పాణ్యం మురళీకృష్ణ, మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వాకా శ్రీనివాసరెడ్డి, మస్తాన్‌వలీ, రాంబాబు, అజిత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాల్ని సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. విద్యానగర్‌లోని పాఠశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సిలంబం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో 9వ తరగతి విద్యార్థి బి.నిశాంత్, 8వ తరగతి విద్యార్థి డి.గని, 6వ తరగతి విద్యార్థిని బి.సంజన బంగారు పతకాలు పొందారని వివరించారు. తమ విద్యార్థులు చదువులోనూ కాకుండా ఆటల్లోనూ ముందంజలో ఉంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కోచ్ కాశీనాథ్‌రెడ్డిని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ దిలీప్, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

యలమంచిలి శివాజీ జన్మదినోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూలు పాలకవర్గ గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ జన్మదినం సందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని శివాజీ నివాసంలో ఆయన్ను కలసిన వారిలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ ఉన్నారు.

వైభవంగా శ్రీ త్రిభువన మహాలక్ష్మీ హోమం



గుంటూరు ఈస్ట్: వెంగళాయపాలెంలోని ఆవుల సంఘంలో శ్రీ రాజశ్యామల పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ త్రిభువన మహాలక్ష్మీ దేవి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ మండపారాధన, గోపూజ, గురు ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీలక్ష్మీ గణపతి హోమం, విశేష దేవతల మూలమంత్రాల పఠనను భక్తిశ్రద్ధలతో జరిపారు. 108 కలశాలతో శ్రీలక్ష్మీ అమ్మవారికి కన్నుల పండుగగా అభిషేకం చేశారు. 11 హోమ గుండాలలో 1188 సార్లు శ్రీ సూక్త హోమాన్ని నిర్వహించారు. విశేష ద్రవ్యాలతో వేదమంత్రాల ఘోష నడుమ పూర్ణాహుతి వేదోక్తంగా జరిపారు. పీఠ వ్యవస్థాపకులు నాగార్జున శర్మ, సందీప్‌శర్మ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం విశేష హోమం చేశామని వివరించారు. మహాలక్ష్మీ అమ్మవారిని ఆరాధించడం వల్ల సర్వ శుభాలు కలుగుతాయని తెలిపారు.

జగన్ పాలనలో ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముస్తఫా



ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కార్పొరేటర్ రిహాన

నెహ్రూనగర్: ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వార్డు సచివాలయాల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. మంగళదాస్ నగర్‌లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్కరూ అర్హత ఉండి సంక్షేమ పథకం అందకుండా ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షని నెల రోజులపాటు నిర్వహించారని తెలిపారు. అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల్ని ఇంటి ముందుకే చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఖర్చులు, రికమండేషన్లు, నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి ముందుకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఫించన్ ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు ఇస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానంలోకి రావాలనే ఉద్దేశంతో సీఎం ఆహ ర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. అందులో భాగంగానే విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తునారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం కులమతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ప్రజా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం 1668 మందికి ధ్రువపత్రాల్ని అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రిహాన పఠాన్, డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు గ్రౌండ్స్‌లో శుక్రవారం కవాతును ఆయన తిలకించారు. అనంతరం పోలీస్ సంక్షేమ దర్బార్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యల్ని పరిష్కరించేందుకు దర్బార్ చేపట్టినట్లు చెప్పారు. పోలీసులు క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. సమస్యల్ని తన దృష్టికి తెస్తే , పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని చెప్పారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడారు. విధి నిర్వహణ, ఆరోగ్యం, పిల్లల విద్య విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్ కృష్ణన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టండి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్, పక్కన డెప్యూటీ సూపరింటెండెంట్లు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఉద్యోగుల సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా కార్యాలయ అధికారులు పనిచేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద మనస్సుతో సమస్యల్ని పరిష్కరించాలని, లేనిపక్షంలో వివరంగా వారికి తెలియజేయాలని చెప్పారు. ఉద్యోగుల నుంచి 16 సమస్యలతో కూడిన వినతి పత్రాల్ని కమిటీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌బాబు దృష్టికి ఆయన తీసుకు వచ్చారు. కమిటీ ప్రతి నెలా రెండో శుక్రవారం జరుగుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు, డెప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ డి.ఎస్. ఎస్. శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని, అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లివర్ వ్యాధులకు అందుబాటులో వైద్యం

కాలేయ వ్యాధుల బారిన పడిన వారికి వ్యాక్సిన్, మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా శుక్రవారం జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో ×వన్ లైఫ్.. వన్ లివర్ హెపటైటిస్ అవగాహన పోస్టర్ ను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. జీజీహెచ్‌లో లభిస్తున్న ఉచిత వైద్య సేవల్ని వినియోగించుకోవాలని ఆయన రోగుల్ని కోరారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ షేక్ నాగూర్ బాషా, డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్యుడు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఓపీ నమోదు కేంద్రాల నిర్మాణానికి మా స్కాన్ వితరణ

జీజీహెచ్‌లో ఓపీ విభాగం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పది రోగి పేర్ల నమోదు కేంద్రాల నిర్మాణం కోసం మా అడ్వాన్స్‌డ్ డయాగ్నోస్టిక్ అండ్ రీసెర్చ్ సెంటర్ అధినేత డాక్టర్ మందపల్లి ఆదినారాయణరావు రూ. 2 లక్షలు విరాళం ప్రకటించారు. ఆయన శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను కలసి చెక్కును అందజేశారు.

ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని పరిశీలిస్తున్న యూనిడో బృంద సభ్యులు

నెహ్రూనగర్: ప్రజాప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలకు తక్షణ పరిష్కారం లభించే విధంగా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆమె శుక్రవారం తన చాంబర్‌లో నగర కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు గుర్తించి, అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యల్ని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విభాగాధిపతుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించారు.

సర్వేను మరింత వేగంగా చేపట్టాలి

స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు మరింత వేగంగా చేపట్టేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో నగరంలో సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వేలో వేగం పెరగాలని, బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓట్ల సర్వే చేయాలని చెప్పారు. సూపర్‌వైజర్లంతా ప్రతి రోజు వారి పరిధిలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనాలని ఆమె ఆదేశించారు. సర్వేలో వెనుకబడిన బీఎల్‌ఓలతో మాట్లాడి, సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, డి.రవీంద్ర, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా అభివృద్ధి పనులు

గుంటూరు నగరంలో కాలుష్యరహితంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంటు ఆర్గనైజేషన్ (యూనిడో) సహకరిస్తోందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం యూనిడో ప్రతినిధులు కమిషనర్‌ని కలసి, నగరంలో చేపడుతున్న పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దడానికి యూనిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జీఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తోందని వివరించారు. సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ఫండ్స్ మంజూరు చేసిందన్నారు. పనులు కూడా చివరి దశకు వచ్చాయని, త్వరలో గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు కేటాయించిన ఈ-ఆటోల పనితీరును యూనిడో పరిశీలిస్తోందన్నారు. యూనిడో సహకారంలో రానున్న కాలంలో గుంటూరు నగరం స్వచ్ఛ నగరంగా, కాలుష్య రహిత నగరంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం యూనిడో బృందం సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్‌ని, క్షేత్రస్థాయిలో ఈ-ఆటోల పనితీరుని పరిశీలించింది. కార్యక్రమంలో యూనిడో ప్రాజెక్ట్ బృందం సభ్యులు డాక్టర్ నందపాల్ సింగ్, దీపికా సిరిపాల్, పి.వి.రమణారావు, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈఈ కొండారెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకం

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని, టెండర్ పొందిన అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువు మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేసిన పనుల బిల్లుల్ని నూరు శాతం చెల్లించినందుకు కమిషనర్‌ని శుక్రవారం ఆమె చాంబర్‌లో కాంట్రాక్టర్లు కలసి శాలువా కప్పి, ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా రమేష్ మాట్లాడుతూ నగరంలో చేపట్టిన పనులకు రూ.10.50 కోట్ల విలువైన బిల్లులకు ఏకకాలంలో చెల్లింపులు చేసిన కమిషనర్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు శివనాగేశ్వరరావు, ప్రభాకర రెడ్డి, జయరామిరెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

యూసీసీకి వ్యతిరేకంగా రేపు నగరంలో భారీ ర్యాలీ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలతో పాటు యూసీసీ (యూనిఫైడ్ సివిల్ కోడ్)కు వ్యతిరేకంగా ఆదివారం నగరంలో ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను వివిధ క్రైస్తవ సంఘ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో క్రిస్టియన్లపై దహనకాండ, హత్యాకాండలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు మాట్లాడుతూ ఈ రెండు కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఆగస్టు 6న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ సంఘ నాయకులు బి. స్టాలిన్ బాబు, కందుల దీన మణి రాజు, తిప్పాబత్తిన గోవింద్, రాయపూడి మరియ దాసు, చిన్న డేవిడ్ విలియమ్స్, కె. వినోద్‌కుమార్, కట్టా దీనరాజు, స్వప్న, సౌజన్య పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి సూచించారు. నల్లపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 21 పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, గీతాలాపాన, ముగ్గుల పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. జనభాగిధారి పేరుతో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సీహెచ్. రాజ్యలక్ష్మి, ఎంఈవో వి. వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సి. వీరయ్య, ఏఎంవో సాయికృష్ణ ప్రసాద్, హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో హిస్టాలజీ ల్యాబ్ ఆధునీకరణ



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ ఉమాజ్యోతి తదితరులు



ల్యాబ్‌కు నూతనంగా ఇచ్చిన మైక్రోస్కోప్‌లు

- 1996 బ్యాచ్ వైద్య విద్యార్థుల వితరణ
- రూ. 12 లక్షల విరాళం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1996 బ్యాచ్ వైద్య విద్యార్థులు తాము కళాశాలలో అడుగుపెట్టి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రీ యూనియన్ పేరుతో కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో గుర్తింపు తీసుకొచ్చిన మాతృ సంస్థ గుంటూరు వైద్య కళాశాలకు తమ వంతు బాధ్యతగా రూ. 12 లక్షల విరాళంతో అనాటమి వైద్య విభాగంలో హిస్టాలజీ ల్యాబ్‌ను ఆధునీకరించారు. నూతనంగా మైక్రోస్కోప్‌లు, ప్రొజెక్టర్లను అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆధునీకరించిన ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాల, జీజీహెచ్ అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థుల సేవలు అభినందనీయమని కొనియాడారు. తమ మాతృ సంస్థ అభ్యున్నతి కోసం విదేశాల్లో స్థిరపడి కూడా సాయం అందిస్తున్నారని వెల్లడించారు. తల్లిదండ్రులు ప్రాణం పోసి తీర్చిదిద్దితే, గుంటూరు వైద్య కళాశాల జీవిత పాఠాల్ని నేర్పిందని తెలిపారు. అద్భుతమైన వైద్య మెలకువల్ని ఇదే కళాశాలలో నేర్చుకున్నామని, కళాశాలపై ప్రతి ఒక్కరూ మమకారం కలిగి ఉండాలని సూచించారు. పూర్వ వైద్య విద్యార్థులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

గురువులకు సన్మానం

తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన పలువురు సీనియర్ వైద్యుల్ని ఘనంగా సన్మానించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మురళీ బాబూరావు, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రామ్‌తారక్‌నాథ్, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వీ, ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ కృపాదానం, వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి, డాక్టర్ వై.వి.ఎస్. ప్రభాకర్ తదితరుల్ని సన్మానించి గురుభక్తి చాటుకున్నారు. కళాశాలలో తాము చదువుకున్న తరగతి గదుల్ని సందర్శించి, బల్లలపై కూర్చొని నాటి జ్ఞాపకాల్ని నెమరు వేసుకున్నారు. కళాశాలలో 150 మంది కోర్సు అభ్యసించగా, 90 మంది రీ యూనియన్‌కు హాజరయ్యారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వైద్యులతోపాటు, అమెరికా నుంచి సైతం వచ్చారు. జీజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ నాతాని శ్రీకాంత్, గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మారుతీ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రంగనాథ్ తదితరులు రీ యూనియన్ నిర్వాహకులుగా కీలక బాధ్యతలు వహించారు.

రేపు ఎండ్రోక్రైనాలజీ రాష్ట్ర సదస్సు

గుంటూరు మెడికల్: ఎండ్రోక్రైన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తొలిసారిగా గుంటూరులో ఎండ్రోక్రైనాలజీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ డాక్టర్ లావణ్య కటకం చెప్పారు. గుంటూరులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు ఐటీసీ హోటల్‌లో ఈనెల 30న వార్షిక సమావేశం జరుగుతోందన్నారు. ఇందులో హార్మోన్, థైరాయిడ్, డయాబెటిస్ సమస్యలపై చర్చలతో పాటు వైద్య విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 250 మంది వైద్యులతో పాటు ఎండ్రోక్రైన్ సొసైటీ నేషనల్, స్టేట్‌కు చెందిన ముఖ్య నేతలు హాజరవుతారని ఆమె వెల్లడించారు. సదస్సుకు హాజరయ్యేవారికి నాలుగు సీఎంఈ క్రెడిట్ అవర్స్ ఉంటాయని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

నగరంపాలెం: న్యాయమైన విద్యుత్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించడంలో నిర్లక్ష్యం సరికాదని గుంటూరు జిల్లా ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్ ఖన్నా, కన్వీనర్ రవిశంకర్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనకు జాషువా రచనలు దోహదం

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: సమాజంలోని అసమానతల నిర్మూలనకు జాషువా రచనలు ఎంతో దోహదం చేశాయని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన గుర్రం జాషువా వర్థంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జాషువా కవితలు, రచనల్లో పూర్తిగా సామాజిక కోణం ప్రతిబింబిస్తుందని, ఆయన కవిత్వం నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తన కవితల ద్వారా విశ్వనరుడిగా నిలిచిన మహోన్నత కవి జాషువా అని పేర్కొన్నారు. ఆయన కవిత్వంపై మరింత లోతుగా పరిశోధనలు, అధ్యయనం జరగాలని అభిప్రాయపడ్డారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి ప్రసంగిస్తూ కవికి మరణం ఉండదన్నారు. జాషువా వంటి మహాకవి తన రచనల రూపంలో ఎప్పటికీ బతికే ఉంటారని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి ప్రసంగిస్తూ జాషువా కవిత్వంలో సామాజిక, ఆర్థిక అసమానతలు, వివక్షతకు సంబంధించిన అంశాలు ప్రధానంగా ప్రతిబింబిస్తాయని వివరించారు. ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా జాషువా రచనలు చదవాలని సూచించారు. తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ ఈ. మాధవి, డాక్టర్ ఎన్.వి. కృష్ణారావు, పలువురు అధికారులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఆలయ ఈఓని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: ఆలయ కార్యనిర్వహణాధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా తమ్మా శివారెడ్డి పని చేస్తున్నారు. ఈ క్రమంలో చైర్మన్ మొగిలి సతీష్‌కుమార్ తన జన్మదినం పురస్కరించుకుని ఆలయం చుట్టూ ఫ్లెక్సీలు కట్టాడు. వాటిని తీసివేయాలని ఫోన్ చేసిన ఈఓ శివారెడ్డిని సతీష్ దుర్భాషలాడాడు. దీనిపై ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం కేసులో నలుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదండరామయ్య నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు మహిళను, ఇద్దరు విటుల్ని స్టేషన్‌కు తరలించారు. మహిళను రెస్క్యూ హోమ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై దాడి

ఇద్దరిపై ఐదుగురు దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గౌతమీ నగర్‌లో శుక్రవారం ఉరుసు నిర్వహిస్తున్నారు. మద్యం మత్తులో చిన్న గొడవ నేపథ్యంలో సుబ్బరాజు, అఖిల్, నాని, అనుదీప్, ఆకాష్ కలసి వెంకటేష్, అతని తండ్రి వెంకటేష్‌పై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం: జిల్లాలోని ప్రత్తిపాడులో మూడు ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఇద్దరు డీలర్లు సక్రమంగా రికార్డులు నిర్వహించకుండా వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా దుకాణాల నుంచి రూ.1.63 లక్షల ఖరీదు చేసే 14.150 మెట్రిక్ టన్నుల ఎరువులు స్వాధీనం చేసుకుని, రెండు ×6ఏ॰ కేసులు నమోదు చేశారు. ఇక మూడు దుకాణాల్లో ప్రిన్సిపల్ ధ్రువీకరణ పత్రాల్లేకుండా విక్రయాలు చేస్తున్న రూ.1.63 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలు నిలిపివేశారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.